# పందిరి మంచం

ఎన్నట్నుంచో మనసులో ఉన్నది మణెమ్మకు - ఆ పందిరిమంచం మీద కూర్చోవాలని! అది మామూలు పందిరిమంచమా... ఈనాటి మంచమా! మూడు అడుగుల పైనే ఎత్తు... ఆపైన మెత్తని పరుపు... మెత్తమెత్తని దిండ్లు... నాలుగు అడుగుల ఎత్తు పందిరి... దానికి వెనక పరదాలు ఉండేవి.

మంచానికి ఆనుకొని రెండడుగుల వెడల్పా మూడడుగుల పొడవు అద్దం... మంచంలో కూర్చున్నా పడుకున్నా అద్దంలో కనబడుతుంది. అది తలచుకుంటే మణెమ్మకు తగని సిగ్గు. ఒకసారి ఆ మంచం మీద పడుకొని... అమ్మో, కాదు కాదు... కనీసం కూర్చొని... ఆ అద్దంలో చూడాలని!

మణెమ్మ ఆ బంగళా పనిమనిషి. యజమానురాలు మాలతీదేవి. యజమాని కనకరావు. వాళ్లకు ఒకే ఒక్క కొడుకు. ఆ కొడుకు ప్రస్తుతం అమెరికాలో ఎం.ఎస్. చదువుతున్నాడు. ఇకపోతే ఆ బంగళాముందు కారు ఉంటుంది. డ్రైవర్ ఉంటాడు. బొచ్చుకుక్క ఉంటుంది.

అయ్యగారు... అంటే కనకరావు స్నానానికి వెళ్ళినపుడు అమ్మగారు ఆ పందిరిమంచం ఉన్న గదిని ఊడ్చి శుభ్రం చేసేందుకు మణెమ్మను పిలుస్తుంది. కళ్ళింత చేసుకొని నగిషి నగిషీల ఆ పందిరిమంచాన్ని చూస్తుంది మణెమ్మ. 'ఎంత మనసు పెట్టి ఏ వ్రాండంగి చెక్కిందో గిన్ని నగిషీలు ఆ మంచానికి'...అనుకుంటుంది మణెమ్మ. అమ్మగారు ఆ మంచం మీద తెల్లని మల్లెపూవులాంటి చెద్దరు వేయించేది. చెద్దరు వేస్తుంటే తీస్తుంటే ఆ మెత్తని పరుపు తాకగానే గుండెల్లో ఏదో హాయి... క్రమంగా ఆ హాయి కాస్తా కోరికగా

మారింది. ఒక్కసారి.... ఒక్కసారి.... ఆ మంచంమీద కూర్చుంటే... అమ్మో, అమ్మగారు చూస్తే ఇంకేమైనా ఉందా! పని మనిషికి అటువంటి ఆలోచన రావచ్చునా... 'రాకూడదు' అనుకుంది మణెమ్మ. ఒక్కసారి ... ఉహూఁ... వొద్దు... వొద్దు...

***

"....ఎప్పటికీ గీ కుక్కి మంచం... చినిగిన చెద్దరేనా..." భర్త మీద విసుక్కుంది మణెమ్మ.

"ఎన్నడూలేంది ఇది ఇట్లా మాట్లాడతాంది ఏందబ్బా" అనుకున్నాడు కోటయ్య.

ఏడుస్తున్న చంటాణ్ణి ఎడాపెడా బాదింది."ఎప్పుడూ నీకు ఏడ్పే..."

"ఏమైంది దీనికి! చంటోడి మీద ఎన్నడూ దెబ్బ వేయనిది!" ఆశ్చర్యంగా చూశాడు కోటయ్య.

"ఒక మంచి అద్దం కొనుక్కురా మొగడాఅంటే వింటావా... గీ పాడు అద్దం ముక్కల మొహం చూసుకోవాలె. ఒక పాపెడ తీసుకోరాదు... ఒక బొట్టు పెట్టుకోరాదు... అడ్డమైన కొంప... అడ్డమైన కొంప"... రుసరుసలాడింది మణెమ్మ. అద్దం ముక్కను విసిరేస్తే దాని అదృష్టం బాగుండి గోనెసంచుల చుట్టమీద పడింది.

"ఏమైంది నీకు?" కోపంగా చూశాడు కోటయ్య.

"ఏం కావాలె?" ఎదురు ప్రశ్న వేసింది మణెమ్మ.

"మంచం బాగలేదంటవ్... అద్దం బాగలేదంటావ్.. ఏందె?"

"బాగాలేంది... బాగలేదంటె నీకెందుకు మంట?"

"ఇంతకన్న బాగున్నయా నీ తల్లి గారింట్ల?"

"ఇదిగో, నా తల్లిగారి జోలి తీస్తే మర్యాద చిక్కది" చూపుడు వేలితో బెదిరించింది మణెమ్మ.

"ఓ పోరడా... ఈడ కూసో..."

ఇంకా నడకరాని చంటిపిల్లాడు... అంబాడుతున్న పసివాడు... వాణ్ణి ఎత్తి కుక్కిమంచంలో కుదేసింది. బిడ్డను ఎంతో ముద్దుచేసే మణెమ్మ... మురిపెంగా కొడుకును చూసుకునే మణెమ్మ...అసహనంగా ఉంటోంది. కోపం కోపంగా... చిటపటలాడుతూ కనబడుతోంది.

***

మాలతీదేవికి రెండురోజులు ఊరు ప్రయాణం పడింది. కనకారావుకు ఆఫీసు పనులున్నందున ఒంటరిగా బయలుదేరింది.

"చెప్పినవన్నీ విన్నవు కదా."

"అట్లనే అమ్మా" మణెమ్మ తలూపింది.

"జాగ్రత్త!"

"అట్లనే అమ్మ."

"సార్‌కు సమయానికి అన్నీ సిద్ధంగా ఉండాలి."

"అట్లనే అమ్మ."

"వంట మనిషిని దుమ్మా కొట్టద్దు అని చెప్పినా..."

"అట్లనే అమ్మా."

"నువ్వు దుమ్మా కొడ్తవా?"

అట్లనే అమ్మా అన్లేదు మణెమ్మ.

"నేను యాడికి పోతానమ్మా... ఈడనే ఉంట కదా" అంది.

బంగళా ఆవరణలోనే మణెమ్మ వాళ్ళుండే పాక ఉంది. ఆ పాక దగ్గరలో ఎప్పటిదో పాత గొయ్యి ఒకటి ఉంది. చెత్తాచెదారంతో సగం దాకా నిండిపోయింది.

మణెమ్మ కొంగుకు చేతులు తుడుచుకుంటూ బంగళా నుంచి పాకకు వస్తోంది.

"ఎన్ని సార్లు చెప్పాల్నే నీకు... చంటోన్ని సంకల ఏసుకనన్న పో...లేకపోతే పడుకో బెట్టి గల్పకు ఏదైనా అడ్డం పెట్టి పొమ్మని..." భార్య వంక ఉరిమి చూశాడు కోటయ్య.

"ఇప్పుడేమైందని!" పెడసరంగా అన్నది మణెమ్మ.

"ఏమైందా, నేను వచ్చేసరికి చంటోడు గల్పదాటి... అంబాడుకుంట... బాయిబొంద దిక్కు పోతాండు."

"మరి నన్నేం చేయమంటవ్... సంటోన్ని తీసుకపోతే ఆడ పనిచేయనిస్తడా... మనకో ఇల్లు అయ్యేదాకా పిల్లలొద్దంటె ఇన్నవా?" మొగడిని కసురుకుంది.

"ఇది ఇల్లుకాదా...ఇంతకంటె మంచిది దొరుకుద్దా. ఈ పట్నంల మనకు?"

ఆ మాటకు మూతిముడిచింది మణెమ్మ

"గంతకు తగ్గ బొంత... అని నీ కంటికి ఇంతకంటె మంచి కొంపేం కనబడ్డది

ఊరికి పోయి మీ అవ్వను తొలుకరా. ఏమో... గిన్ని రోజులు పోయింది. సంటోన్ని పనికాడికి తీస్కపోను. కావల్నంటె పని మానేస్తా."

"కాలికేస్తె మెడకు, మెడకేస్తే కాలికి... ఎట్లనే నీతోటి.ఏపాటి దూరం పనికి పోతావ్. గీన్నేనాయె... చంటోన్ని చూసుకుంట పని చేయలేవా ఏంది.... ఎంతమందికి చేస్తానవ్... ఇద్దరికే కదా!"

"ఆఁ... మరే... ఇద్దరైతేంది. ముగ్గురైతేంది... పని పనే..." అనుకుంటూ విసవిస పాకలోకి వెళ్ళిపోయింది మణెమ్మ.

***

మరునాడు ఉదయం గదులు శుభ్రం చేస్తున్న మణెమ్మకు మనసు మనసులో లేదు. మెత్తని ఆ పందిరిమంచం పరుపుమీద ఒక్కసారి కూర్చోవాలి. కనకారావు బాత్రూంకు వెళ్ళే సమయం కోసం ఎదురుచూడసాగింది.

అతడు బాత్రూంకు స్నానానికి వెళ్ళగానే పందిరిమంచం ఉన్న ఆ గదిలోకి అడుగుపెట్టింది.

మంచం మీద చెద్దరు మార్చింది. దిండ్లు సరిచేసింది. అటుఇటు చూసింది. ఒక్కసారి...ఒక్కసారి కూర్చోవాలని తహతహ.... ఛీ తప్పు... తనలో తనకే హెచ్చరిక... ఒక్కసారి కూర్చుంటే ఏమవుతుంది? అమ్మగారు కూడా లేరు కదా... ఎవరికి తెలుస్తుంది. డ్రైవర్ ఇటు రాడు. వంటమనిషి పనిలో ఉంది. అమ్మో, సార్ వస్తే.... ఇప్పుడే ఎందుకు వస్తాడు.... వచ్చే లోపల ఒక్కసారి కూర్చుంటే... గుండె దడ దడ కొట్టుకోసాగింది. చేత్తో ఆ మెత్తని పరుపును నిమిరింది. కూర్చో కూర్చో... మనసు తొందరచేస్తున్నది... మనసు ముందుకు తోస్తున్నది. భయం....గుబులు.... గుబులు.... మంచాన్ని, పరుపును తాకుతూ నిల్చున్నది. కూర్చో.... ఊఁ... ఏదో చప్పుడై గబుక్కున నిటారుగా నిల్చున్నది. అప్పటికే ముచ్చెమటలు పోశాయి. గొంతు తడారిపోయింది. బొచ్చుకుక్క తోకాడిస్తూ... పర్యవేక్షణ చేస్తున్నట్లువచ్చి వెళ్ళింది. బాత్రూం నుంచి సార్ వస్తారేమో... నడుం వంచి గది శుభ్రం చేయడంలో మునిగిపోయింది.

***

"ఎప్పుడూ ఈ చిల్లుల బనీన్లేనా... ఒగ మంచి బనీను కొనుక్కోవు" భర్త వంక ఈసడింపుగా చూస్తూ అంది మణెమ్మ.

"ఏమైందే ఈ బనీనుకు... ఒక్క చిల్లి పడింది... గంతేకదా" అన్నాడు కోటయ్య.

"ఆఁ గంతే..." మూతి తిప్పి - "ఒగ సుభ్రంగా ఉండుడు తెల్వది... మంచి బట్ట కట్టుడు తెల్వది." అంది.

"సుభ్రంగా ఉండకపోతే గలీజ్‌గా ఉన్నానె మణి, మనసు సుభ్రంగా ఉండాల్నె...

బట్టలొక్కటె కాదు. ఒక్క చిల్లి ఉన్నంత మాత్రాన ఇది మంచి బనీను కాకుండా పోద్దా...మన తాహతే అంత...సర్దుకపోవాలె... అన్నీ మంచి బనీన్లూ అన్నీ మంచి అంగీలూ కావాల్నంటె వొస్తయా... ఉన్నవాటినే సుభ్రంగా ఉంచుకోవాలె..."

"చాలు చాల్లే... చాతకానమ్మకు' మాటలెక్కువని, చెల్లని పైసకు గీతలెక్కువని... మాటలు బాగా నేర్చినవు. ఈ బతుకింతే... ఈ మురికి కొంప... గొర్రెతోక సంసారం. ఛీ చీ..." విచారంగా తలపట్టుకొని కూర్చుంది మణెమ్మ.

***

కోటయ్య పనిమీద బయటికి వెళ్ళాడు.

వంటమనిషి పొద్దుటి పనులు పూర్తిచేసుకొని వెళ్ళింది. పాకలో చంటాడికి పాలిచ్చి చాప మీద పడుకోబెడుతున్నది మణెమ్మ.

"మణెమ్మ..."

సార్ పిలుపు వినిపించింది.

"సార్..." పరుగు పరుగున వెళ్ళింది.

"అర్జంట్‌గా బయటికి వెళ్ళేది ఉంది."

"అట్లనే సార్"

"ఎవరైనా ఫోన్ చేస్తే అరగంటలో వస్తానని చెప్పు".

"అట్లనే సార్."

కనకారావు బయటికి వెళ్ళాడు.

కనకారావు... కాదు కాదు... సార్ బయటికి వెళ్ళడం మణెమ్మకు సంతోషంగానూ ఉంది. విచారంగానూ ఉంది.

సంతోషం ఎందుకంటే,సార్ అరగంట సేపటిదాకా రాడు తనివితీరా పందిరిమంచం మీద కూర్చోవచ్చు....

విచారం ఎందుకంటే, పందిరి మంచం ఉన్న బెడ్‌రూంకు సార్ తాళం వేసి పోతాడేమో... అమ్మగారు అట్లాగే చేస్తారు.

మనసు చివుక్కుమంది... బాధపడింది.... బిక్కపోయింది.

కానీ...సార్ పందిరిమంచం ఉన్న గదికి తాళం వేసిపోలేదు. కనీసం గడియ కూడా పెట్టలేదు.

మణెమ్మ మనసు ఎగిరి గంతేసింది.

అరగంటసేపు... అరగంటసేపటిదాకా సార్ రాడు. అబ్బ... ఇన్నాళ్ళకు తన కోరిక నెరవేరబోతున్నది.... తనివితీరా కూర్చోవచ్చు... పడుకోవచ్చు... అద్దంలో చూసుకోవచ్చు.

కనకారావు అటు వెళ్ళాడో లేదో... మణెమ్మ మనసు నిలవలేదు...కాలు నిలవలేదు... పరుగున పందిరమంచం గదిలో దూరింది.

ఏదో కమ్మటి వాసన... ఎప్పుడూ లేని సువాసన...మంచాన్ని సమీపిస్తుంటే... పట్టరాని ఆనందం... గుండె వేగంగా కొట్టుకుంటోంది... మనసు ఉక్కిరిబిక్కిరి అవుతోంది.

పందిరిమంచం... మెత్తని పరుపు... ఆహాహా... తనదే హాయి... ఎంత హాయి... ఎప్పటి కోరిక... ఎన్నాళ్ళ తపన... ఒక్క నిమిషం అయినా చాలు... చెద్దరు మార్చుతున్నప్పుడు చేయి తగిలి... ఎన్నెన్ని గిలిగింతలు...

ఎక్కడిది సువాసన... ఏదో మత్తు కమ్మేస్తోంది. ఆ పందిరిమంచం మీద వాలి నిద్రపోవాలి అనిపిస్తోంది....ఒళ్ళంతా గాలిలో తేలిపోతున్నట్టుగా ఉంది... తాను మంచం మీదికి ఒరిగిపోతోంది....

అంతలో ఒక్కసారిగా చంటిపిల్లాడి ఏడ్పు... చంటాడు లేచినట్లున్నాడు... అంబాడుతూ బయటికి వస్తాడేమో... తలుపు చేరవేయలేదు.... అడ్డం ఏదీ పెట్టలేదు.

కానీ... తన అడుగు అక్కణ్ణుంచి కదలనంటోంది. తన మనసు అక్కణ్ణుంచి మరల నంటోంది. ఒక్కసారి... ఒక్కసారి... ఈ అవకాశం మళ్ళీ వస్తుందో లేదో...ఆ పందిరి మంచం మీద... ఆ మెత్తని హాయిని...

ఒక్కసారి...ఒక్కసారి.... చవిచూడాలి.

తన ప్రమేయం లేకుండానే శరీరం పందిరిమంచం మీద వాలబోతుంది....

ఆ సువాసన తనను గాలం వేసిలాగుతోంది.... తనకేదో అవుతోంది.... కళ్ళు మత్తుగా వాలిపోతున్నాయి.

చంటాడి అరుపు...

ఉహూఁ... కదలకు... ఇంత మంచి అవకాశం జారవిడుచుకోకు. వివశురాలై... మనసు వశురాలై.... పందిరిమంచం వైపు ఒరుగుతోంది.

దగ్గరగా చంటాడి అరుపు...బావిబొంద వైపు పోతున్నాడేమో...

"అమ్మో నా కొడుకు"... ఒక్కసారి తనను తాను విదిలించుకుంది మణెమ్మ. తూలి పడబోయింది. బయటికి పరుగెత్తింది.

పరుగు పరుగున వెళ్ళి గోతిలో జారిపడబోతున్న కొడుకును ఒక్క అంగలో అందుకొని... గుండెకు హత్తుకుంది:..!!

*ఈనాడు ఆదివారం, 31-8-2008*